సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023

మల్లన్న ఆలయం మూసివేత



ఓదెల(పెద్దపల్లి): చంద్రగ్రహణం కారణంగా ఓదెల మల్లిఖార్జునస్వామి ఆలయాన్ని శనివారం ఆలయ సిబ్బంది మూసివేశారు. ఆదివారం దర్శనం కోసం ముందస్తుగా భక్తులు స్వామివారికి సన్నిధికి విచ్చేస్తుంటారు. కానీ చంద్రగ్రహణంతో భక్తులు లేక ఆలయం నిర్మానుష్యంగా మారింది. ఆదివారం ఉదయం 8గంటలకు యథావిధిగా మల్లికార్జునస్వామి దర్శన కార్యక్రమాలు జరుగుతాయని చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక శాంతినికేతన్ హైస్కూల్‌లో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళిని, శ్రీలక్ష్మి, న్యాయవాదులు బి.అనురాధ, సదన్‌కుమార్, గుడికందుల భూమయ్య, పెర్క మనోహర్, వరలక్ష్మి, సోషల్ వర్కర్ మిట్టపల్లి శంకర్, గోదావరిఖని టూటౌన్ సీఐ–2 అఫ్జలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ముగిసేవరకు ప్రజావాణి రద్దు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. జిల్లా అధికారులంతా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైనందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



ఢిల్లీ ప్రదర్శనలో హెల్మెట్ గురించి రాష్ట్రపతికి వివరిస్తున్న హర్షిత (ఫైల్)


పెద్దపల్లిరూరల్: రామగిరి మండలం చందనాపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దాసరి హర్షిత 'సకూర' వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. నవంబర్ 4నుంచి జపాన్ దేశంలో జరిగే హైస్కూల్ విద్యార్థుల 'సకూర' అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని జిల్లా విద్యాధికారి మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 14 నుంచి 16వరకు ఢిల్లీలో జరిగిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో జిల్లానుంచి నలుగురు విద్యార్థులు పాల్గొనగా, హర్షిత ప్రతిభచాటి కేంద్రమంత్రి జితేంద్రసింగ్ నుంచి అవార్డు అందుకుంది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫైన్ కార్యక్రమంలో శిరస్త్రానం గురించి రాష్ట్రపతికి వివరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈసందర్భంగా హర్షితకు డీఈవో, జిల్లాసైన్స్ అధికారి, హెచ్‌ఎం లక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.

వైద్య సేవలు మెరుగుపర్చండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రమోద్‌కుమార్ ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి వైద్యసేవల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ, టీబీ నియంత్రణ, సీజనల్, అసంక్రమిత వ్యాధులపై సుదీర్ఘంగా సమీక్షించారు. లింగ నిష్పత్తిలో 1,000 మంది మగ పిల్లలకు 900 కంటే తక్కువ ఆడ పిల్లలు పుట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. గర్భంలోనే ఆడ, మగ అని తెలుకోవడం నేరమని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.50వేల వరకు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృపాబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.రాజమౌళి, కేవీ.సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ టి.రాజేశ్, డీపీఓ రాజేందర్, డీడీఎం మహేందర్, అడ్డగుంటపల్లి, లక్ష్మీపూర్, ఫైవింక్లయిన్, జనగామ, అల్లూరు, రామగుండం అర్బన్, బసంత్‌నగర్, అంతర్గాం, పుట్నూర్ పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



"గుడ్లగూబ పగలు చూడలేదు..కాకి రాత్రిని చూడలేదు..
ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని, ప్రజాస్వామ్యాన్ని చూడలేరు."
– డాక్టర్ అబ్దుల్ కలామ్

మీకు తెలుసా?

ఈవీఎంలకు 41ఏళ్లు

కరీంనగర్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు వినియోగంలోకి వచ్చి 39ఏళ్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా 1982లో ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదట్లో వీటి వాడకానికి కేంద్ర ఎన్నికల సంఘం ససేమిరా అన్నప్పటికి అనంతర కాలంలో ఓకే చెప్పింది. మొదటిసారి 1982 మే 19న జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్ నియోజకవర్గంలో ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరాల్లో 10 నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో వినియోగించారు. వీటిని వినియోగించవద్దని 1984 మే 5న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా మార్పులు చేసి 1988 డిసెంబర్‌లో సెక్షన్ 61 ద్వారా కేంద్రం ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఆ తరువాత సెక్షన్ 61ఏ సవరణలను 1989 మార్చి 17న ప్రజాప్రాతినిధ్యం చట్టం అమలులోకి తెచ్చింది. దీన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో ఈవీఎంల వాడకం మళ్లీ ప్రారంభమైంది. 1990 జనవరిలో ఎన్నికల సంస్కరణల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్‌లో ఈవీఎంల వాడకాన్ని సాంకేతిక నిపుణుల కమిటీ సమర్థించింది. ఈవీఎంల వాడకానికి 1998లో ప్రజా ఆమోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. లోక్‌సభకు 2004, 2014 మధ్య జరిగిన మూడు ఎన్నికల్లో వీటినే వాడారు. వీవీప్యాట్లను వాడాలని వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లు వినియోగిస్తున్నారు.



కాయ్ రాజా కాయ్!

ఎన్నికల పోరు.. బెట్టింగ్ జోరు

- ఒక వైపు వరల్డ్‌కప్.. మరోవైపు ఎన్నికల సందడి
- టిక్కెట్ ఖరారు నుంచి మెజార్టీ వరకు
- రూ.లక్షల్లో పందెంకాస్తున్న బెట్టింగ్‌రాయుళ్లు



'గోదావరిఖని నియోజకవర్గంలోని ఓ ద్వితీయ శ్రేణి నాయకుడు ఇటీవల పార్టీ మారాడు. దీంతో సదరు పార్టీ నాయకుడికి, పాత పార్టీలోని నాయకుల మధ్య జోరుగా రాజకీయ చర్చ జరిగింది. ఈ చర్చ కాస్త మా నాయకుడే గెలుస్తాడు అంటే లేదు మా నాయకుడే గెలుస్తాడు.. అంటూ సాగింది. చివరికి వారు రూ. లక్షల్లో బెట్టింగ్‌కాయటంతో పాటు, బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ రాసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి ఘటనలు జిల్లాలోని ప్రతి పల్లెలో జోరుగా జరుగుతున్నాయి'.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాకు ఎన్నికల ఫీవర్ పట్టుకుంది. కొందరు కార్యకర్తలు తమ పార్టీ నాయకుడి కోసం ప్రచారం చేసుకుంటూనే.. మరోవైపు ఎన్నికలను జూదంగా మార్చి బెట్టింగ్ కాస్తున్నారు. కొందరు వీటిని సరదాగా కాస్తే, మరికొందరు డబ్బే ధ్యేయంగా పందాలు కాస్తున్నారు. పార్టీపై ఉన్న మోజుతో మరికొందరు బెట్టింగ్ చేస్తున్నారు. దీంతో అంతిమంగా వారందరూ ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. క్రికెట్‌తో మొదలైన బెట్టింగ్ ఇప్పుడు అన్ని రంగాల్లోకి చాపకింది నీరులా విస్తరిస్తోంది.

పందాలు పలు రకాలు..

క్రికెట్‌లో వలె టాస్ ఎవరూ గెలుస్తారు నుంచి ఏ బాల్‌కు సిక్స్, ఫోర్ కొడుతారు లాంటి పలు అంశాలపై బెట్టింగ్ ఎలా కాచేవారో ఇప్పుడు ఎన్నికల సమయంలో అనేక రకాలైన అంశాలపై రూ.వేల నుంచి లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. బీఆర్‌ఎస్ చీఫ్ సిట్టింగ్స్‌కే టిక్కెట్స్ ఇస్తాడా? లేదా? అన్న అంశం మొదలుకొని, సిట్టింగ్‌లకు సీట్లపై, తర్వాత కాంగ్రెస్‌లో ఏ నాయకుడికి టికెట్ వస్తుంది? రెబల్స్‌గా ఎవరు నామినేషన్లు వేస్తారు? ఇలా పందెం కాస్తున్నారు. ప్రస్తుతం తమ నియోజకవర్గంలో ఫలానా నాయకుడే గెలుస్తాడు, ఇంత మెజార్టీ వస్తుంది.. తదితర అంశాలపై జోరుగా బెట్టింగ్ నడుస్తోంది. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు జిల్లాలోని నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులే కాకుండా, రాష్ట్రంలోని ప్రముఖ రాజకీయ నాయకుల గెలుపోటములు, వారి మెజార్టీపై కూడా జోరుగా పందెం కాస్తున్నారు. ముఖ్యంగా పట్టణ కేంద్రాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో కొంచెం పలుకుబడి ఉన్న ద్వితీయశ్రేణి నాయకులు, రాజకీయాలంటే ఆసక్తి చూపే ఉన్నత వర్గాలు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్కువగా వీటిపై ఆసక్తి చూపుతున్నారు. అలాగే కొంతమంది బెట్టింగ్‌రాయుళ్లు రాజకీయాల మీద ఆసక్తి ఉన్నవారిని గమనించి ఈ ఊబిలోకి దించుతున్నారు.

లక్షల్లో బెట్టింగ్..

ఎన్నికల నేపథ్యంలో బెట్టింగ్ భూతం విజృంభిస్తోంది. సాధారణంగా క్రీడల్లో ఎక్కువగా కనిపించే బెట్టింగ్ నేడు అన్ని రంగాల్లోకి వేగంగా దూసుకెళ్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎన్నికల సందడి కనిపిస్తోంది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఉదయం నుంచి పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని, సాయంత్రం విందుల్లో తేలుతున్నారు. ఆ సమయంలో రాజకీయాల గురించి చర్చించుకుంటూ బెట్టింగ్‌లు కాస్తున్నారు. తమ పార్టీకి, తమ నాయకుడికి ఉన్న అనుకూలత ఆధారంగా ఒకటికి రెండు రేట్లు పందెంకాస్తున్నారు. కొందరు బెట్టింగ్‌లు రూ.లక్షల్లో కాస్తే, మరికొందరు ఫలితం తెలిసిన తర్వాత ఓడిపోయిన వారు పార్టీ ఇవ్వాలనే షరతులు పెట్టుకుంటున్నారు. కొందరైతే మాట మీద నమ్మకం లేక బాండ్ పేపర్ల మీద అగ్రిమెంట్‌లు రాసుకుంటున్నారు. పోలీసులు, ఇతర ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల పనుల్లో బిజీగా ఉండటంతో వీటి వైపు పోలీసులు దృష్టిసారించలేకపోతున్నారు. ఇదే అదనుగా బెట్టింగ్‌రాయుళ్లు విజృంభిస్తున్నారు.

చిత్తశుద్ధితో ప్రజల పక్షాన పనిచేశా

- మంత్రి కొప్పుల ఈశ్వర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అద్భుత ప్రగతి సాధించామని, సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా చిత్తశుద్ధితో ప్రజల పక్షాన పనిచేసి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని పత్తిపాక క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సింగపూర్ గ్రామానికి చెందిన బీఎస్‌పీ మండల అధ్యక్షుడు గొడుగు ప్రశాంత్, పత్తిపాక ఉపసర్పంచు, బీజేపీ నాయకుడు బండారి శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు గడ్డం ప్రభాకర్‌రెడ్డి, కమ్మరిఖాన్‌పేట, ఎర్రగుంటపల్లి, ఖిలావనపర్తి గ్రామాలకు చెందిన పలు పార్టీల యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలతో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే కుట్రను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, మెన్నేని నర్సింగరావు, పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, కూరపాటి శ్రీనివాస్, అజ్మీర మల్లేశంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే జాఫర్ జమానా పునరావృతం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ గెలిస్తే జాఫర్ జమానా పునరావృతం అవుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దాదాపు 55 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ హయాంలో బోఫోర్స్ కుంభకోణాలు, అవినీతి అక్రమాలు, గూండాగిరి, రౌడీయిజమే రాజ్యమేలాయని అన్నారు. గోదావరిఖనిలో జాఫర్ జమానాను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీయే అని పేర్కొన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు, ఉద్యమకారులపై రాళ్లతో దాడి చేసిన వారు నేడు అధికారం పొందడం కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరిస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చేయాలన్నారు. టూరిస్టుల మోసపు మాటలు నమ్మి విలువైన ఓటును వృథా చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు నాయిని శంకర్, గంధ్ర దామోదర్‌రావు, మాదాసు రామ్మూర్తి, జాహిద్‌పాషా, వడ్డేపల్లి శంకర్, కనకం శ్యాంసన్, మూల విజయారెడ్డి, శశి, పుట్ట రమేశ్, జోసెఫ్, కెనడి, సప్పిడి రామస్వామి, బాల రాజ్‌కుమార్, గంగరాజు, పోలాడి శ్రీనివాసరావు, పీచర శ్రీనివాస్, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జనగామ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రజల సమస్యలు విని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, 24 గంటల మంచినీటి సౌకర్యం, మెరుగైన పారిశుధ్యం తదితర సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఇక్కడ రౌడీయిజం, భూకబ్జాలు, అవినీతి అంతమొందించాలంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఐదేళ్లు సుపరిపాలన అందిస్తానన్నారు. నాయకులు సోమారపు లావణ్య రాజమణి, కుసుమ, సత్యప్రకాష్, పుష్ప, కిషన్‌రావు, మామిడాల చంద్రయ్య, వడ్లూరి రవి, జనగామ రాయలింగం, మంచికట్ల బిక్షపతి, పిడుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి

- చెక్‌పోస్టులలో నిష్పక్షపాతంగా తనిఖీలు
- నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



సమావేశంలో అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల ఎన్నికలు, పోలీస్, రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు వివరించారు.

క్షేత్రస్థాయిలో సమీక్షించాలి

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై సమీక్షించాలని ఆదేశించారు. సీవిజిల్ యాప్ గురించి గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. సువిధ మొబైల్ యాప్, యూజర్ చార్జీల గురించి తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీల్లో నిష్పక్షపాతంగా ఉండాలి

చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. సామన్యులకు ఇబ్బంది కలగకుండా పట్టుబడిన నగదు, వస్తువులపై సమీక్షించుకొని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పనితీరును సీసీకెమెరాలలో పర్యవేక్షించాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.

పోలింగ్‌శాతంపై దృష్టిపెట్టాలి

గతంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితాలో డూప్లికేట్, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని, ఒకే ఇంటినంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులు, 80 ఏళ్ల పైబడి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని గోడౌన్లు, షాదీఖానాలు, ఫంక్షన్‌హాళ్లలో తనిఖీలు చేపట్టాలని, బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలని సూచించారు.

వీడియో రికార్డింగ్ చేయాలి

క్యూఆర్‌కోడ్, సరైన పత్రాలు లేకుండా బ్యాంకులు తరలించే నగదును సీజ్ చేయడంతోపాటు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వికాస్‌రాజ్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాబోతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డు చేయించాలని సూచించారు. అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, డీఐజీ కె.రమేశ్ నాయుడు, ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు ప్రఫుల్ దేశాయ్, యాస్మిన్ బాషా, ముజమ్మిల్ ఖాన్, భీమ్యానాయక్, రామగుండం సీపీ రెమోరాజేశ్వరి, ఎస్పీలు అఖిల్‌మహాజన్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు డబ్బులు ఇప్పిస్తా

- రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు పూర్తిస్థాయిలో డబ్బులు ఇప్పిస్తానని రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం గేట్ వద్ద కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమలు వస్తే నిరుద్యోగ యువకులకు ఉపాధి కలుగుతుందనే ఆశతో భూములు, ఊర్లను త్యాగం చేస్తే లక్షల డబ్బులు పెట్టుబడి పెట్టి ఉద్యోగాలు కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉద్యోగాల కోసం డబ్బు పెట్టి మోసపోయిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కచ్చితంగా 100శాతం డబ్బులు ఇప్పిస్తామని, నిరుద్యోగులను మోసం చేసినవారిని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగంపై ఆశతో దళారుల చేతిలో మోసపోయిన బాధితులకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ప్రతిఒక్కరూ ఆలోచించి దోపిడీ పాలనను బొందపెట్టాలని కోరారు. తనను రాజకీయంగా అంతం చేయాలని చూస్తున్నారని, ఎవరికీ భయపడేది లేదన్నారు. కార్మికులు సైతం ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఎన్నికల కంట్రోల్ రూం

జ్యోతినగర్(రామగుండం): రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల కోసం 24/7 పని చేసేలా కంట్రోల్ రూం నంబర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఓటర్లకు సంబంధించి ఓటరు కార్డు, పోలింగ్ స్టేషన్, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన సలహాలు, సూచనలు, సందేహాలు, ఫిర్యాదులకు 1800 4256 521 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి విషయాలు తెలుసుకోవచ్చని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి


అన్వేశ్‌రెడ్డి (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి మడక గ్రామంలో శనివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని అదే గ్రామానికి చెందిన నోముల అన్వేశ్‌రెడ్డి(14) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. అన్వేశ్‌రెడ్డి మరో బాలుడు బైక్‌మీద పొత్కపల్లి గ్రామం నుంచి మడక వస్తుండగా, సుల్తానాబాద్ నుంచి పొత్కపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈప్రమాదంలో అన్వేశ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు నోముల రాజేందర్‌రెడ్డి, స్వరూప బోరున విలపించారు. బాయమ్మపల్లెకు చెందిన ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఆధారాలు లేని నగదు, వస్తువులు స్వాధీనం

మంథని: మంథని నియోజకవర్గ పరిధిలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీవో హనుమనాయక్ తెలిపారు. 23 కేసుల్లో రూ.40,33,860 స్వాధీనం చేసుకోగా, సరైన ఆధారాలు చూపించిన 17 మందికి తిరిగి రూ.35,12,960 అందించినట్లు పేర్కొన్నారు. అలాగే 38 డీజే బాక్సులు, 5 ఆంప్లిఫయర్లు, రెండు స్పీకర్లు స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.2.29 లక్షలు ఉంటుందన్నారు. కాగా ఆధారాలు చూపిన రూ.లక్షా 84 వేల విలువ గల వస్తువులను విడుదల చేసినట్లు తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారంలో శనివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై వస్తున్న భార్యాభర్తలపై కుక్కలు దాడికి యత్నించగా అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ రాజయ్య, మధునమ్మ ఖిలావనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మల్లాపూర్‌కు మోటార్ సైకిల్‌పై వస్తుండగా నందిమేడారంలో కుక్కలు వెంటపడ్డాయి. దీంతో భయాందోళనకు గురైన రాజయ్య మోటార్‌సైకిల్‌ను అతివేగంగా నడిపించి కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

23 మంది బైండోవర్

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 23మందిని తహసీల్దార్ రజని ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ బర్పటి రమేశ్ తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకులు, గతంలో కేసులు నమోదైన 23మందిపై ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా బైండోవర్ చేసినట్లు వివరించారు.

ప్రతీ పోరు రసవత్తరం

- ఆరు మండలాల ముఖచిత్రం
- 2009లో నియోజకవర్గ కేంద్రంగా..
- పేరు మారింది.. రాజకీయ తీరూ మారింది
- గతంలో నాలుగు నియోజకవర్గాల సమాహారం
- నియోజకవర్గం ఏర్పాటు నుంచి 'కొప్పుల'కే పట్టం

పోలింగ్ కేంద్రాలు	269
మొత్తం ఓట్లు	2,24,591
పురుషులు	1,90,963
స్త్రీలు	1,14,622
ఇతరులు	6





గొల్లపల్లి: మార్పులు.. చేర్పులు.. కూర్పులు.. నాలుగు నియోజకవర్గాలు.. ఆరు మండలాల సంపూర్ణ ముఖచిత్రం ధర్మపురి. ఒకప్పుడు మేదా రం, చొప్పదండి, జగిత్యాల, బుగ్గారం నియోజకవర్గాల్లో ఉన్న గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, ధర్మపురి మండలాల (తాజాగా ఎండపల్లి)తో 2009లో ధర్మపురి (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గమైంది. అప్పటినుంచి ఇక్కడ అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి.


మాతంగి నర్సయ్య (ఫైల్)


న్యాలకొండ రాంకిషన్ రావు (ఫైల్)


శికారి విశ్వనాథం (ఫైల్)


జువ్వాడి రత్నాకర్ రావు (ఫైల్)


కొప్పుల ఈశ్వర్


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నృసింహుడు కొలువైన ప్రాంతం..

శ్రీలక్ష్మీ నృసింహస్వామి వెలిసిన పుణ్యక్షేత్రమైన ధర్మపురి పేరిట ఏర్పాటైన ఈ నియోజకవర్గం.. పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఏడు మండలాల్లో కలిపి 129 గ్రామాలు.. మొత్తం 2,24,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,90,963 మంది, మహిళలు 1,14,622, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 63 శాతం బీసీలు, 23శాతం ఎస్సీలు, ఇతరులు 15 శాతం వరకు ఉన్నారు. పునర్విభజనకు ముందు గొల్లపల్లి మండలంలోని 8 గ్రామాలు జగిత్యాల నియోజకవర్గంలో, 17 గ్రామాలు చొప్పదండిలో, ధర్మపురి మండలం సిరికొండ గ్రామం చొప్పదండిలో.. మిగిలిన గ్రామాలు బుగ్గారం నియోజకవర్గంలో ఉండేవి. అలాగే పెగడపల్లిలోని నాలుగు గ్రామాలు జగిత్యాలలో, ఐదు గ్రామాలు, మేడారం, 17 గ్రామాలు చొప్పదండి పరిధిలో ఉండేవి. వెల్గటూర్‌లోని 19 గ్రామాలు మేడారంలో, ఐదు గ్రామాలు చొప్పదండిలో, రెండు గ్రామాలు బుగ్గారంలో ఉండేవి. ధర్మారం మండలం పూర్తిగా మేడారం నియోజకవర్గంలోనే ఉండేది.

తీర్పు విలక్షణం

- ధర్మపురి నియోజకవర్గానికి ముందు చొప్పదండి నియోజకవర్గం నుంచి 1957లో సీహెచ్.రాజేశ్వర్ రావు(పీడీఎఫ్) విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ నుంచి బండారి రాములు, 1978లో న్యాలకొండ శ్రీపతిరావు (ఐఎన్‌సీ(ఐ)), 1983లో గుర్రం మాధవ రెడ్డి (స్వతంత్ర) గెలిచారు. 1985, 1986, 1994 వరకు న్యాలకొండ రాంకిషన్‌రావు (టీడీపీ) వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించి మంత్రిగా కొనసాగారు. 1999లో కాంగ్రెస్ నుంచి కోడూరి సత్యనారాయణగౌడ్ విజయం సాధించారు. 2004లో టీడీపీ నుంచి సాన మారుతి విజయం సాధించారు. అనంతరం ఎస్సీ రిజర్వ్ అయినా 2009లో సుద్దాల దేవయ్య (టీడీపీ) నుంచి గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఉద్యమంలో పాలుపంచుకున్న 2014లో బొడిగె శోభ (టీఆర్‌ఎస్) నుంచి విజయం సాధించారు.
- ధర్మపురి నియోజకవర్గానికి ముందు బుగ్గారం (జనరల్) నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలు ఉండేవి. అప్పటి ఓటరు తీర్పు సపరేట్ అన్నట్లు సాగింది. 1957 నుంచి 2004 వరకు అభ్యర్థి ఏ పార్టీకి చెందినా.. చివరకు స్వతంత్రంగా పోటీ చేసినా నియోజకవర్గ అభివృద్ధిని ఆశించినవారినే గెలిపించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో బద్దం ఎల్లారెడ్డి (స్వతంత్ర), 1962లో ఏనుగు నారాయణ రెడ్డి (స్వతంత్ర), 1972లో జోగిని దామోదర్‌రావు (స్వతంత్ర)కు పట్టంగట్టారు. 1978లో అంబల్ల రాజారాం(కాంగ్రెస్), 1983లో కడకుంట్ల గంగారాం (కాంగ్రెస్), 1985లో ఉప ఎన్నిక సమయంలో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టం కట్టారు. తిరిగి 1989లో జువ్వాడి రత్నాకర్‌రావు (స్వతంత్ర)ను గెలిపించారు. మళ్లీ 1994లో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టంగట్టారు. అనంతరం 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో జువ్వాడి (కాంగ్రెస్)ను గెలిపించారు.

2009 నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోట

2009లో ధర్మపురిగా ఆవిర్భవించినప్పటి నుంచి ఈ నియోజకవర్గప్రజలు ఒకే అభ్యర్థికి పట్టంగడుతూ వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటివరకు 2009, (2010లో ఉప ఎన్నిక) 2014, 2018లో ఎన్నికలు జరగగా.. ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తూ వస్తున్నారు. 2018లో గెలిచిన అనంతరం మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రతిసారీ ప్రధాన పోటీదారుగా కాంగ్రెస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన) ఉన్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లోనూ ఇద్దరిమధ్యే పోటీ ఉండనుంది. తను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఐదోసారి కూడా గెలిపిస్తాయని మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. ఈ సారి అటు సానుభూతి, ఇటు ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ అంటున్నారు.

పుట్ట మధు వాహనం తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీసులు

మంథని: మంథని–పెద్దపల్లి దారిలో గంగాపురి వద్ద తనిఖీల్లో భాగంగా పోలీసుల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీలకు మధు సహకరించారు.

బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటాం


మాట్లాడుతున్న చంద్రశేఖర్

మంథని: అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా తాము ముందుకు సాగుతామని బీసీ సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పిల్లి చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, మంథని నియోజకవర్గంలో బీసీలను పూర్తిస్థాయిలో కలుసుకొని బీసీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతామని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గ బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడిగా పెద్దపల్లి మహదేవ్, ఉపాధ్యక్షులు ఆత్మకూరి స్వామియాదవ్, పెండ్యాల రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయగిరి సమ్మయ్య, కోశాధికారి చాట్లపల్లి తిరుపతి, కార్యదర్శులు తిరుపతి, పెరుమండ్ల అనిల్‌గౌడ్, రెడ్డి శేఖర్ సహాయ కార్యదర్శులు పోత వెంకటస్వామి, మంథని రఘువీరప్రసాద్, ప్రచార కార్యదర్శి గొల్లపెల్లి రాయమల్లును నియమించినట్లు తెలిపారు. సమావేశంలో కట్టికోల పర్వతాలుయాదవ్, బొల్లం రవీందర్‌గౌడ్, పెంచాల రమ్యయాదవ్, సమ్మెట స్వప్న, జక్కుల సతీశ్, చాట్లపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో బీజేపీ చరిత్ర సృష్టిస్తుంది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శశీల్ జీ నామోషీ

మంథని: మంథనిలో బీజేపీ గెలుపు చరిత్ర సృష్టిస్తుందని, కొత్త నాయకత్వానికి అవకాశం ఇచ్చి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెంపపెట్టులా ప్రజల తీర్పు ఉండబోతుందని మైసూర్ ఎమ్మెల్సీ శశీల్‌జీ నామోషీ అన్నారు. శనివారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మండల, మోర్చా, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలతో సమావేశమయ్యారు. దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. అసత్య ప్రచారాలు నమ్మి కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీ బలాన్ని ఓర్వలేక అసత్య ప్రచారాలను చేస్తూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నారని, కార్యకర్తలు నెల రోజులు కష్టపడి పని చేస్తే భవిష్యత్ తరాలకు మంచి జీవితాలను కల్పించినవారు అవుతారన్నారు. మంథని ప్రాంతంలో మార్పునకు శ్రీకారం చుట్టి సునీల్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తనకు టికెట్ రాదని అసత్య ప్రచారం చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. అన్ని పార్టీల వలె బీజేపీ స్వార్థంతో పనిచేయదని, కష్టపడ్డవారికి, కార్యకర్తలకు అండగా ఉంటుందని ప్రజలు గుర్తించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి


సమావేశంలో సంఘం నాయకులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తమ డిపాజిట్ డబ్బులు ప్రభుత్వ ఖజానాలో జమచేశామని, తమకు మాత్రం అప్పులు మిగిలాయని రెండో విడత గొర్రెల కోసం ఎదురుచూస్తున్న యాదవులు ప్రశ్నిస్తున్నారని గొర్రె కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతియాదవ్ అన్నారు. శనివారం కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడారు. ఇప్పటికైనా వెంటనే తమకు గొర్రెలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే యాదవుల ఆగ్రహానికి గురికావలసి వస్తోందని, గొర్రెల పంపిణీపై స్పష్టమైన ప్రకటన చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు గాజనవేన సదయ్యయాదవ్, తొట్ల రవియాదవ్, బత్తిని లక్ష్మణ్, కొమురయ్య, జింక మల్లేశ్, ఎల్లేశ్, వెంకట్రాజం, జక్కుల కుమార్, పోచాలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

ఎలిగేడు(పెద్దపల్లి): రైతులు ఆయిల్‌పామ్ పంటపై దృష్టిసారించి, సాగు చేస్తే లాభాదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌పూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి పంట ఒక్క ఎకరం సాగు చేసే నీటితో ఆయిల్‌పామ్‌ను 3 నుంచి 4ఎకరాల వరకు సాగు చేయవచ్చన్నారు. కోతులు, అడవి పందులు, పక్షుల నుంచి ఎలాంటి బెడద ఉండదని వివరించారు. పంట వేసిన మూడో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై 6వ సంవత్సరం తర్వాత గరిష్ట దిగుబడి 14 నుంచి 18 టన్నులు వస్తుందని, ఒక ఎకరాకు ఏడాదికి రూ.1,50,000 వరకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. పంట నాటిన 4వ ఏడాది వరకు మొక్కజొన్న, పత్తి, కూరగాయలు వంటివి అంతరపంటలుగా వేసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి, ఏఈవో గణేశ్, ఫీల్డ్‌ఫీసర్ అభిలాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి


ఎన్నికల ప్రచారంలో రవీందర్ సింగ్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మరోసారి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్, పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ సింగ్ కోరారు. పెద్దపల్లి పట్టణంలో శనివారం సిట్టింగ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, నాయకులు తబ్రేజ్, చందు, గట్టయ్య తదితరులున్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన


పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

ముత్తారం(మంథని): మండలంలోని ధర్యపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను శనివారం మంథని డీఎల్‌పీవో రాంబాబు పరిశీలించారు. కేంద్రంలో విద్యుత్ సరఫరాను సరిచేసి మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని స్థానిక సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, సర్పంచి గాదం స్రవంతిశ్రీనివాస్ ఉన్నారు.

బంగారు ఆభరణాలు పట్టివేత

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట శివారులో బంగారు ఆభరణాలు పట్టుకున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎంహెచ్ 46 బీఏ 3201 నంబరు కారులో కరీంనగర్ బోయవాడకు చెందిన తనుకు సందీప్ డ్రైవర్ సాకేతో కలిసి కరీంనగర్ వైపు వస్తున్నారు. టోల్‌ప్లాజా చెక్ పోస్ట్ వద్ద కారు తనిఖీ చేయగా అందులో 150 గ్రాముల బంగారం లభించింది. దానికి సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని, సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కాగా.. టోల్‌ప్లాజా సమీపంలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టువద్ద సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమ మద్యం సీజ్ చేసినట్లు జమ్మికుంట ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని కోరపల్లి గ్రామానికి ఓ మహిళ అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తోందనే సమాచారంతో దాడులు నిర్వహించి రూ.6,732 విలువైన మద్యం సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. అదే విధంగా వావిలాల గ్రామంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తుల నుంచి 65 మద్యం బాటిళ్లు, 24బీర్లను స్వాధీనం చేసుకున్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు సమష్టిగా ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ కోరారు. శనివారం డైరెక్టర్ క్యాంపు కార్యాలయంలో జీడీకే-5 ఓసీపీకి సంబంధించి సర్వే మ్యాప్ పరిశీలించారు. గ్యాలరీ పని స్థలాల్లో జరుగుతున్న పనుల గురించి పరిశీలించి భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి సూచనలు సలహాలు అందజేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ప్రాజెక్ట్ అధికారి కె.చంద్రశేఖర్, ఏజెంట్స్ బి.సైదులు, చిలుక శ్రీనివాసు, సర్వే అధికారి ప్రభాకర్, ఓసీపీ–2 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, సర్వే ఆఫీసర్ నర్సింగరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఓసీపీ–3 సందర్శన

ఆర్జీ–2 పరిధి ఓసీపీ–3 ప్రాజెక్టును డైరెక్టర్ శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఆర్‌వీఆర్ కంపెనీ ఓబీ వెలికితీత పరిశీలించారు. నూతనంగా ఓబీ పనులు చేపట్టనున్న ఆర్‌వీఆర్–2 కాంట్రాక్టు పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలన్నారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1,2 జీఎంలు సూర్యనారాయణ, శ్రీనివాస్, అధికారులున్నారు.

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి


రక్షణ షీల్డ్ అందజేస్తున్న అధికారులు

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం వకీల్‌పల్లిగనిలో 54వ వార్షిక భద్రత పక్షోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వందశాతం బొగ్గు ఉత్పత్తితో వకీల్‌పల్లిగనికి మంచి గుర్తింపు ఉందన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని, అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. రక్షణపై రాజీలేకుండా ముందుకు సాగాలని పేర్కొన్నారు. యువ ఉద్యోగులకు రక్షణ సూత్రాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత సీనియర్లపై ఉందన్నారు. 2021 సంవత్సరానికి గాను ట్రస్ట్ ఏరియాకు సంబంధించి వకీల్‌పల్లి గని మొదటి బహుమతి సాధించగా శనివారం కార్మికుల సమక్షంలో అందజేశారు. పనిలో నైపుణ్యం కనబరచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. రక్షణపై ఉద్యోగులు ప్రదర్శించిన నాటిక, పాటలు అలరించాయి. రీజియన్‌సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, కమిటీ కన్వీనర్ డి.లలిత్‌కుమార్, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, రక్షణ అధికారి రాంకుమార్, సంక్షేమ అధికారి ఓంకారి బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

గోదావరిఖని(రామగుండం): రాబోయే ఎన్నికల్లో సింగరేణి విస్తరించి ఉన్న 11 ఏరియాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సాయిలీలా రెసిడెన్సీలో మాట్లాడారు. వచ్చే నెల 30న నిర్వహించే ఎన్నికల్లో యూనియన్ వ్యవహరించాల్సిన వైఖరిపై యూనియన్ సెంట్రల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి చర్చించామని తెలిపారు. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వివరించారు. కోలిండియాలో లేని హక్కులను కార్మికులకు సీఎం కేసీఆర్ ఇప్పించారని అన్నారు. కేసీఆర్ కృషి వల్లే లాభాల బోనస్ వచ్చిందని 18శాతం ఉన్న లాభాల వాటా 32శాతానికి పెంచారని వెల్లడించారు. కార్మికులు మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను గెలిపించి రుణం తీర్చుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావ్

డిసెంబర్ 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నిలపై కూడా చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నాయకులు నూనె కొమురయ్య, మంద మల్లారెడ్డి, సంపత్‌కుమార్, దీకొండ అన్నయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకముందు సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించగా సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.